andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.4 । కనిష్ఠం 26.6



నిర్మల్
జిల్లా వార్తలు

బుధవారం 15 మే 2024

పోలింగ్‌సిబ్బందిపై దాడి హేయనీయం : ఎస్టీయూ

నిర్మల్ కల్చరల్, మే 14 : నారాయణఖేడ్‌జిల్లాలో పోలింగ్ సిబ్బందిపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం హేయనీయమైన చర్య అని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. భూమన్న యాదవ్, జే. లక్ష్మణ్ అన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సిబ్బందికి రెమ్యునరేషన్ చెల్లింపులో ఎన్నికల సంఘం నిర్ణయించిన విధంగా కాకుండా తక్కువ చెల్లించారని పేర్కొన్నారు. లాఠీచార్జికి కారకులైన వారిపై చర్య తీసుకోవాలని లేనట్టయితే ఉద్యమిస్తామని హెచ్చరించారు.



గెలుపు లెక్కలు

- జిల్లాలో పోలింగ్ సరళిపై విశ్లేషణలు
- గ్రామాల వారీగా అంచనాలు
- రూరల్ పోలింగ్ సరళిపై ఆశలు
- అన్ని పార్టీల్లో మొదలైన టెన్షన్

నిర్మల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ముగిసిన లోక్‌సభ ఎన్నికల ఓట్లసరళిపై ప్రధానపార్టీలు విశ్లేషణలు జరుపుతున్నాయి. నెలరోజుల నుంచి మారుమోగిన ప్రచారం ఏ మేరకు తమకు అనుకూలిస్తుందోనన్న లెక్కల్లో పార్టీలు బిజీ అవుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలంతా తమ తమ పరిధిలో పోలైన ఓట్ల శాతాన్ని అలాగే పోలింగ్ సరళిపై విశ్లేషణలు జరుపుతూ కార్యకర్తలతో చర్చలు జరుపుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సారి పోలింగ్‌శాతం పెరగడం తమకు అనుకూలిస్తుందా లేదా నష్టం చేకూరుస్తుందా అన్న అంచనాల్లో తలమునకలవుతున్నారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో మూడు పార్టీల నేతలంతా పోలింగ్ విశ్లేషణల్లోనే నిమగ్నమైపోయారు. అయితే స్థానిక కార్యకర్తలు పోలింగ్‌స్టేషన్‌లలో ఓటింగ్ సరళిని గమనించిన ఏజెంట్ల ద్వారా నేతలంతా పూర్తి సమాచారాన్ని రాబట్టుకుంటున్నారు. యువత, మహిళల పోలింగ్ శాతం పెరగడం పట్ల మూడు పార్టీలు తమకు అనుకూలతపై ఆశలు పెట్టుకుంటున్నాయి. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓ వెలుగును వెలిగి ఆధిపత్యం కొనసాగించిన బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఈ సారి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పెద్దగా ప్రభావం చూపలేదన్న ప్రచారం జరుగుతోంది. చాలా బూత్‌లలో ఆ పార్టీ అభ్యర్థులు కరువవ్వడం చర్చకు తావిస్తోంది. గత నెల రోజుల నుంచి బీఆర్ఎస్ పార్టీకి చెందిన చాలా మంది సీనియర్ నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలంతా కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరిపోవడం ప్రస్తుత ఎన్నికల్లో ప్రభావం చూపిందని అంటున్నారు. సరియైన నాయకత్వం లేకపోవడం, ఎన్నికల ప్రచారాన్ని సైతం ధీటుగా నిర్వహించలేకపోవడం బీఆర్ఎస్ పార్టీకి శాపమైందంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీజేపీలు ముఖాముఖిగా తలపడేందుకు అవకాశం ఏర్పడింది. ఈ రెండు పార్టీలు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించి జిల్లాలో అసాధారణ స్థాయిలో పోరాడాయి. అయితే ఎన్నికలు ముగిసిపోవడంతో ఇక గెలుపు తమనే వరించబోతుందన్న ధీమాలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఈ మేరకు జిల్లాలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జులు పోలైన ఓట్ల శాతాన్ని విశ్లేషిస్తూ గెలుపు తమదేనన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. యూత్, మహిళలు, మైనార్టీలు ఈ సారి తమగే మొగ్గు చూపారని పోలింగ్‌లో కూడా మెజార్టీగా వీరి ఓట్లే పోలయ్యాయి గనక తమ గెలుపు ఖాయమైపోయిందంటూ కాంగ్రెస్ నేతలు సంబుర పడుతున్నారు. ఇదిలా ఉండగా బీజేపీ మాత్రం పోలింగ్ సరళిని విశ్లేషిస్తూ గెలుపుపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తోంది. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ తదితరులు జిల్లాలో ఓటింగ్‌సరళిపై మంగళవారం వేరు వేరుగా సమీక్షలు జరిపి గెలుపు తమనే వరించబోతోందంటూ ధీమా వ్యక్తం చేశారు. ఈ సారి యువత ఓట్లు భారీసంఖ్యలో ఉండడం, వారంతా బహిరంగంగానే బీజేపీ వైపు మొగ్గుచూపడం తమకు అనుకూలించబోతోందని వెల్లడిస్తున్నారు. మహిళలు సైతం బీజేపీనే ఆదరించారని వారు చెబుతున్నారు. ప్రధానంగా నరేంద్రమోడీ ప్రభావమే తమకు భారీస్థాయిలో అనుకూలించిందని, దీంతో పాటు తాము జరిపిన బహిరంగ ప్రచారం, అలాగే సోషల్ మీడియా ద్వారా పెద్దఎత్తున కొనసాగించిన ప్రచారంతో తమ గెలుపు ఖాయమైపోయిందంటూ ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే నియోజకవర్గస్థాయిలోని నేతలంతా పోలింగ్ బూత్‌ల వారిగా పోలైన ఓట్ల లెక్కలను కట్టడంలో బీజీగా మారిపోతున్నారు. బూత్‌ల వారీగా మొత్తం పోలైన ఓట్ల శాతం అందులో నుంచి తమకు ఏ మేరకు ఓట్లు పోలయ్యాయన్న వివరాల సేకరణతో గెలుపోటముల ఆశలపై లెక్కలు చేస్తున్నారు. అయితే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుండగా ఇక్కడి బీఆర్ఎస్ పార్టీ నేతలు మాత్రం ఎలాంటి స్పందన కనబర్చకుండా వేచి చూద్దామన్న ధోరణిని కనబరుస్తున్నారు.

గెలుపుపై ధీమాతో బీజేపీ

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీజేపీ ఈ సారి భారీ మెజార్టీని సాధించబోతోందని, పోలింగ్ పూర్తయిన తరువాత ట్రెండ్ తమకు అనుకూలంగా కనిపించిందంటూ ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా యువత, మహిళలతో పాటు సాధారణ జనం కూడా బీజేపీకే ఈ సారి ఓటు వేశారని వారంతా నరేంద్రమోదీని ఆదరిస్తున్నారంటూ ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. యువత ఉత్సాహంగా ఓటు వేయడం వారి పోలింగ్ శాతం విపరీతంగా పెరిగిపోవడంతో బీజేపీ గెలుపుపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది. ఈ సారి బీజేపీ జిల్లాలో లక్ష ఓట్ల మెజార్టీని సాధించబోతోందంటూ ఆ పార్టీ నేతలు బహిరంగంగా చెబుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మడం లేదని ప్రధాని నరేంద్రమోడీ క్రేజ్ తమ ఈ సారి భారీగా అనుకూలించిందంటూ బీజేపీ నేతలు ప్రకటిస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మల్, ముథోల్‌లలో బీజేపీ గెలుపొందిన సంగతి తెలిసిందే. అదే దూకుడును రెండింతలుగా ఈ సారి బీజేపీ కనబడిందని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కన్నా ఈ సారి రెండింతల మెజార్టీ పెరగబోతోందని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. నిర్మల్‌లో దాదాపు గత అసెంబ్లీ ఎన్నికల మెజార్టీ కన్నా రెండింతలు సాధిస్తామని అలాగే ముథోల్ నియోజకవర్గంలో మొన్నటి మెజార్టీ కన్నా ఎక్కువ ఓట్లు సాధిస్తామంటూ బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఆ పార్టీ నేతలంతా పోలింగ్ ముగిసినప్పటి నుంచే గెలుపు తమదేనంటూ సంబురాలు చేసుకుంటున్నారు. మొత్తానికి బీజేపీ లోక్‌సభ ఎన్నికల ట్రెండ్‌ను విశ్లేషిస్తూ గెలుపు తమదేనని ప్రత్యక్షంగా సైతం ప్రకటిస్తోంది.

యూత్, మైనారిటీ ఓట్లపై కాంగ్రెస్ పార్టీ ఆశలు

అయితే మొదటి నుంచి ప్రచారంలో దూకుడు కనబర్చడం అలాగే సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకదృష్టి సారించడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ది పథకాలు లాంటి అంశాలన్ని తమకు ఓటు రూపంలో మారాయని కాంగ్రెస్ పార్టీ పేర్కొంటోంది. ఈసారి యూత్, మైనార్టీ, మహిళల ఓట్లన్ని తమ ఖాతాలోనే జమ అయ్యాయని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఉచిత బస్సు, ఉచిత కరెంటు, 500లకే సిలెండర్ లాంటి ఆరు గ్యారెంటీల హమీ తమ గెలుపు అవకాశాలను రెట్టింపు చేసిందని అంటున్నారు. దీంతో పాటు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క జరిపిన క్యాంపెయినింగ్ తమకు అనుకూలించబోనుందని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అలాగే నిర్మల్‌లో ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జరిపిన పర్యటన కూడా తమకు కలిసిరావచ్చని కాంగ్రెస్ పార్టీ ఆశిస్తూ గెలుస్తామనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ జిల్లాలో భారీగా ఆధికత్య కనబర్చబోతోందని ఆ పార్టీ నేతలంతా ఎక్కడికక్కడ లెక్కలు కడుతూ ధీమాతో ఉన్నారు.

ఆశల పల్లకిలో బీఆర్ఎస్ నేతలు

ఇదిలా ఉండగా బీఆర్ఎస్ పార్టీ నేతలు సైతం గెలుపు ఈసారి తమనే వరించబోతోందని పేర్కొంటున్నారు. అంతర్గతంగా మాత్రం అంతగా ఆశలు లేకున్నప్పటికి తగ్గేదేలే అన్న నినాదంతో వారు గెలుపోటములపై విశ్లేషనలు జరుపుతున్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లపై ఉన్న వ్యతిరేఖతతో పాటు కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ది సంక్షేమ పథకాలను జనాలు ఇప్పటికి మరిచిపోకపోవడం లాంటి అంశాలు లాభించబోతున్నాయని బీఆర్ఎస్ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. జిల్లాలో కేటీఆర్ జరిపిన ప్రచారానికి మంచి స్పందన లభించడం అలాగే స్థానిక నాయకులు పార్టీ ఫిరాయింపులు జరపడంతో ప్రజల్లో పెరిగిన సానుభూతి లాంటి అంశాలు తమ గెలుపుకు బాటలు వేస్తున్నాయని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. మొత్తానికి మూడు పార్టీలు గెలుపోటముల లెక్కలతో బిజీగా మారిపోయాయి.

ముథోల్ నియోజకవర్గంలో

75.63 శాతం నమోదైన పోలింగ్

- తానూర్ మండలంలో 81.81 శాతం పోలింగ్
- భైంసా మండలంలో 68.84 శాతం పోలింగ్ నమోదు

ముథోల్, మే 14 : ముథోల్ నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు ఓటర్లు తమ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారు. అయితే ముథోల్ నియోజకవర్గంలో 75.63 శాతం పోలింగ్ నమోదైనట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కోమల్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 311 పోలింగ్ కేంద్రాలకు గాను ముథోల్ నియోజకవర్గంలో మొత్తం 2,54,579 ఓటర్లు ఉన్నారు. అయితే 1,92,546 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 93,995 పురుషులు, 98,549 మంది స్త్రీలు, ఇద్దరు ఇతరులు తమ ఓటును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో నమోదైన పోలింగ్ శాతం పరిశీలించినట్లయితే... కుభీర్ మండలంలో 76.54 శాతం, కుంటాల 77.39 శాతం, నర్సాపూర్(జి) 76.19 శాతం, భైంసా 68.84 శాతం, లోకేశ్వరం 79.86 శాతం, ముథోల్ 78.92 శాతం, బాసర 80.91 శాతం, తానూర్ 81.81 శాతం పోలింగ్ నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో అత్యధికంగా తానూర్ మండలంలో, తక్కువ శాతం భైంసా మండలంలో పోలింగ్ నమోదైంది. తానూర్ మండలంలో అత్యధికంగా 81.81 శాతం పోలింగ్ నమోదు కాగా భైంసా మండలంలో 68.84 శాతం పోలింగ్ నమోదైంది.

యోగాసాధనతో

దీర్ఘకాలిక వ్యాధులు దూరం



యోగగురువు రాటి పోతన్నకు సర్టిఫికెట్‌ను అందిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, మే 14 : క్రమం తప్పకుండా నిత్యం యోగాసాధనతో దీర్ఘకాలిక వ్యాధుల దూరమవుతాయని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్‌పాటిల్ పేర్కొన్నారు. బెంగుళూర్‌లోని వివేకానంద యోగ అనుసందన్ సంస్థన్ ద్వారా అంతర్జాతీయ యోగా ఇన్‌స్ట్రక్టర్ శిక్షణను పూర్తి చేసుకున్న భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన యోగా గురువు రాటి పోతన్న కు సర్టిఫికెట్‌ను అందచేసిన సందర్భంగా భైంసాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యోగశిక్షణ పొందిన వారందరూ తమ తమ ప్రాంతాల్లో యోగా సాధనతో చేకూరే ఆరోగ్య ప్రయోజనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా వారందరిలో యోగాపై అసక్తిని పెంపొందింప చేయాలని సూచించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించడమే కాకుండా మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం కొద్ది సమయమైన యోగాసాధన చేయాలన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఇన్‌స్ట్రక్టర్ శిక్షణను పూర్తి చేసుకున్న యోగా గురువు రాటి పోతన్నకు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, డివిజన్ పరిధిలోని యోగా శిక్షకులు, పలు ప్రాంతాల సాధకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు.

ఉపాధ్యాయులపై దాడి సరికాదు : పీఆర్టీయూ

నిర్మల్ కల్చరల్, మే 14 : సంగారెడ్డి జిల్లాలో ఎన్నికలు ముగించుకొని వచ్చిన ఉపాధ్యాయులపై పోలీసు లు దాడి చేయడం సరికాదని పీఆర్టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై. సాయన్న, రవిరాజ్ ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రెమ్యునరేషన్ ఇవ్వకపోవడాన్ని ప్రశ్నిస్తే లాఠీఛార్జ్ చేశారని ఆరోపించారు. ఇలాంటి చర్యలు పునరా వృతం కాకుండా చూడాలని వారు కోరారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలతో

పెరుగుతున్న సమస్యలు



జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న లీకేజీ నీరు



మురికి కాలువను అనుకొని ఏర్పడ్డ లీకేజీతో నెలకొన్న దుస్థితి

భైంసా, మే 14 : మున్సిపల్ కేంద్రమైన భైంసాలో మిషన్ భగీరథ నీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్థంగా కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో పైప్‌లైన్లకు లీకేజీ ఏర్పడి పరిస్థితి అధ్వానంగా మారుతోంది.లీకేజీ ప్రాంతాల నుంచి విలువైన నీరు వృధాగా పోతోంది. ప్రధానంగా జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పట్టణ పరిధిలోని పిప్రి కాలనీలో పైప్‌లైన్ లీకేజీల సమస్య అధికంగా ఉంది. ఇక్కడి ప్రాంతంలో లీకేజీ నీరు జాతీయ రహదారిపై ప్రవహిస్తోంది. రోడ్డును అనుకొని నీరు నిలిచిపోతుండంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.అంతేకాకుండా ఇక్కడి ప్రాంతంలో మురికి కాలువలను అనుకొని లీకేజీలు అధికంగా ఉన్నాయి. లీకేజీ నీరు ,మురికి కాలువల్లోని మురికి నీరు కలిసిపోయి ప్రవహిస్తుండటం ఆరోగ్య సమస్యలకు దారితీసే పరిస్థితులు నెలకొన్నాయి. లీకేజీ ప్రాంతాల్లో గుంతలు ఏర్పడి లీకేజీ నీరు వాటిల్లో నిలిచిపోతున్నాయి. నీటి సరఫరా ముగిసిన అనంతరం గుంతలలోని నీరు తిరిగి లీకేజీ ప్రాంతం నుంచి పైప్‌లైన్‌లోకి వెళ్లిపోతోంది. తదుపరి సరఫరా జరిగిన సమయంలో ముందుగా గుంతలలో నిలిచి పైప్‌లైన్‌లలోకి వెళ్లిన నీటి సరఫరా జరుగుతుండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. మున్సిపల్ అధికార యంత్రాంగం తమ ప్రాంతాల్లో నెలకొని ఉన్న పైప్‌లైన్ లీకేజీ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయా ప్రాంతాలవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

స్వస్థలాల నుంచి తిరిగి వచ్చిన ఓటర్లు

భైంసా, మే 14 : పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రెండు రోజుల క్రితం స్వస్థలాలకు వెళ్లిన ఓటర్లు తాము నివాసముంటున్న ప్రాంతాలకు మంగళవారం తిరిగి వచ్చారు. పోలింగ్ కారణంగా సోమవారం బోసిపోయి కనిపించిన ప్రయాణ ప్రాంగణాలు మంగళవారం నివాస ప్రాంతాలకు తరలివచ్చిన ఓటర్లతో క్రిక్కిరిసిపోయి కనిపించాయి. ప్రయాణీకుల రాకపోకలు అంతంత మాత్రంగానే ఉండటంతో వెలవెలబోయిన బస్సులు రద్దీగా మారాయి. గ్రామీణ, వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఉద్యోగ,ఉపాధి, విద్య, వ్యాపార, వాణిజ్యాల కోసం గాను జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్, కుభీర్, బాసర, సారంగపూర్, మామడ తదితర కేంద్రాలకు వచ్చి నివాసం ఉంటున్నారు.

వీరందరూ సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కోసం గాను శని, ఆదివారాల్లో తమ తమ స్వస్థలాలకు వెళ్లారు. ఓటింగ్ ప్రక్రియ ముగియడంతో వీరందరూ తాము నివాసముంటున్న కేంద్రాలకు తరలి వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వేళ నుంచి భైంసా, నిర్మల్, ఖానాపూర్ ప్రయాణ ప్రాంగణాలన్నీ రద్దీగా కనిపించాయి. బస్సులన్నీ కిక్కిరిసిపోయి కనిపించాయి.



భైంసా బస్టాండ్ వద్ద ప్రయాణికుల రద్దీ



కిక్కిరిసిపోయి ఉన్న భైంసా ప్రయాణ ప్రాంగణం

సంక్షిప్త సమాచారం

ట్రాక్టరు బోల్తా.. డ్రైవర్ మృతి



మృతి చెందిన జాదవ్ వినోద్

కుభీర్, మే 14 : మండలంలోని చాత గ్రామ శివారులో మంగళవారం ట్రాక్టరు బోల్తా పడి డ్రైవరు మృతి చెందినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్ర భోకర్ తాలుక బెంద్రి గ్రామానికి చెందిన జాధవ్ వినోద్(18) అనే వ్యక్తి, తన తండ్రి జాదవ్ రాంప్రసాద్‌లు గత రెండు సంవత్సరాల నుంచి చాతా గ్రామానికి చెందిన దేవేందర్‌రెడ్డి అనే వ్యక్తి దగ్గర డ్రైవరుగా పని చేస్తున్నారు. మంగళవారం అ జాగ్రత్త, అతివేగంతో ట్రాక్టర్ నడపడంతో చాత గ్రామశివారులో ట్రాక్టరు బోల్తాపడి జాధవ్ వినోద్ అనే డ్రైవరుకు తలకు బలమైన గాయాలు తగలడంతో రక్త స్రావం జరిగి అక్కడిక్కడే మృతి చెందాడు. ట్రాక్టరు పై ఉన్న మరో వ్యక్తి రాటి చిన్న లక్ష్మణ్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

నిర్మల్ కల్చరల్, మే 14 : నిర్మల్‌లోని గాంధీనగర్ మర్రిచెట్టు సమీపంలోని హనుమాన్ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. మాజీ కౌన్సిలర్ డి. శ్రీనివాస్, వ్యాపారవేత్త ముత్యం, సంతోష్ గుప్తాను ఆలయ కమిటీ సన్మానించింది. ఏ. రాజేందర్, ఏ. శ్రీను, రాము, తదితరులు పాల్గొన్నారు.

25న హైదరాబాద్‌లో

పెన్ మహోత్సవం



నిర్మల్ కల్చరల్, మే 14 : ఈ నెల 25, 26న హైదరాబాద్‌లోని బోయినపల్లిలో రెండు రోజులపాటు పటేల్స్ ఇంటర్ప్రె న్యూరోనెట్వర్క్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు మున్నూరు కాపు సంఘం తెలిపింది. మంగళవారం ఇందుకు సంబంధించిన పెన్ మహోత్సవ బ్రోచర్ ఆవిష్కరించారు. ఉదయం 11 గంటల నుంచి ఈ ప్రదర్శనను ఉచితంగా సందర్శించవచ్చునని తెలిపారు. సత్య, మంగ్లారపు ప్రవీణ్, సుమిత్, దశరథ్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

టైరు పేలి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన గూడ్స్‌వ్యాన్

● ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు ● వెంటనే ఆస్పత్రికి తరలింపు





నర్సాపూర్(జి), మే 13 : నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండలంలోని రాంపూర్ గ్రామ శివారులోని గోట్ పాం వద్ద సోమవారం ఉదయం తొమ్మిది న్నర గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాంపూర్ గ్రామం నుండి నిర్మల్ ఆసుపత్రికి వెళ్తున్న కారు (టీఎస్ 16-ఈడబ్ల్యూ-2770)ను నిర్మల్ నుండి భైంసా వైపు వెళ్తున్న మహీంద్రా సుప్రో గూడ్స్ వాహనం(టీఎస్08-యూహెచ్ 7123) ముందర టైరు పేలడంతో కారును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న శేక్ బాబుకు తలకు తీవ్రగాయాలయ్యాయి. బాబు చిన్న కుమారుడు శేక్‌సల్మాన్‌కు కుడిచేయి విరిగింది, పెద్ద కుమారుడు శేక్ ఫారూఖ్, వియ్యంకుడు మహమ్మద్ జమాల్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు కారులో నిర్మల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మహీంద్రా సుప్రో వాహనం డ్రైవర్ అతి వేగంతో అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని డ్రైవర్ శేక్ సల్మాన్ బావ సయ్యద్ ఇర్ఫాన్ పోలీస్ స్టేసన్‌లో సాయంత్రం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

నిర్మల్ జిల్లాలో తగ్గిన పోలింగ్ శాతం




భైంసా, మే 14 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తవ్వగా అందరూ ఫలితాల కోసం ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని మూడు నియోజక వర్గాల పరిధిలో గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు పెరిగినప్పటికి పోలింగ్ శాతం తక్కువగా నమోదు అయ్యింది. ముథోల్ నియోజక వర్గ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో 80.54 శాతం పోలింగ్ నమోదు అవ్వగా పార్లమెంట్ ఎన్నికల్లో 75.64 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.ఇక ఓటర్ల వారీగా పరిశీలిస్తే వివరాలు ఇలా ఉన్నాయి.

● 5,025 మంది ఓటర్ల పెరుగుదల

గత అసెంబ్లీ ఎన్నికల్లో ముథోల్ నియోజక వర్గ పరిధిలో 1,27,792 మంది మహిళా ఓటర్లు, 1,21,744 మంది పురుష ఓటర్లు, ఇతరులు కలుపుకొని మొత్తం 2,49,554 మంది ఓటర్లు ఉండగా అందులో నుంచి 1,02,967 మంది మహిళా ఓటర్లు, 98,076 మంది ఓటర్లు,ఇతరులను కలుపుకొని 2,01,044 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 80.54 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో ముథోల్ నియోజక వర్గ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల కంటే 5,025 మంది ఓటర్లు పెరిగారు. నియోజక వర్గ పరిధిలో మొత్తం 2,54,579 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1,30,978 మహిళా ఓటర్లు, 1,23,583 మంది పురుష ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియలో 98,549 మంది మహిళా ఓటర్లు, 93,995 మంది పురుష ఓటర్లు, ఇతర ఓటర్లను కలుపుకొని మొత్తం 1,92,546 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 75.64 శాతం పోలింగ్ నమోదు అయ్యింది

● 4.9 శాతం తక్కువ పోలింగ్

అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే ముథోల్ నియోజక వర్గ పరిధిలో 4.9 శాతం పోలింగ్ తక్కువగా నమోదు అయ్యింది. అసెంబ్లీ ఎన్నికల్లో 80.54 శాతం నమోదు అవ్వగా పార్లమెంట్ ఎన్నికల్లో 75.64 నమోదు అయ్యింది. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో నియోజక వర్గ పరిధిలో మొత్తం 2,49,554 మంది ఓటర్లు ఉండగా, పార్లమెంట్ ఎన్నికల్లో 5,025 మంది ఓటర్లు పెరిగి మొత్తం 2,54,579 చేరుకున్నారు. పెరిగిన ఓటర్లలో 3186 మంది మహిళలు, 1839 మంది పురుషులు ఉన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో 1,02,967 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోగా పార్లమెంట్ ఎన్నికల్లో 98,549 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక పురుష ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లో 98,076 మంది ఓటు హక్కు వినియోగించుకోగా పార్లమెంట్ ఎన్నికల్లో 93,995 మంది మాత్రమే వినియోగించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో 4,418 మంది మహిళలు, 40,81 మంది పురుషులు కలిపి మొత్తం 8499 తక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.





పోటెత్తిన మహిళలు


● పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడంలో ఖానాపూర్ నియోజకవర్గ మహిళలదే పైచేయి
● పురుషులతో పోలిస్తే 4.03 శాతం ఎక్కువ మహిళల పోలింగ్ నమోదు
● మహిళల ఓటింగ్ పెరగడం తమకంటే తమకే కలిసి వస్తుందని లెక్కలేసుకుంటున్న పార్టీలు

ఖానాపూర్, మే 14 : సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గంలో ఓటు వేయడంలో మహిళలు చైతన్యం ప్రదర్శించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో మొత్తం 2,24,523 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,09,685, మహిళలు 1,14,825, ఇతరులు 13 మంది ఓటర్లు ఉన్నారు. కాగా పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 1,62,101 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 76,926 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 85,171 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 4 ఇతరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ శాతం 72.20గా నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 70.13 శాతం మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 74.17 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. పురుషులకంటే 4.04 శాతం మంది మహిళలు అధికంగా ఓట్లు వేసినట్లు చెబుతున్నారు. పురుషుల కంటే నాలుగు శాతం మంది మహిళలు ఎక్కువగా ఓట్లు వేయడం తమకంటే తమకే కలిసి వస్తుందని రాజకీయ పార్టీలు లెక్కలు వేస్తున్నాయి. కాగా హైదరాబాద్ లాంటి పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదు అవుతున్న నేపథ్యంలో మారుమూల నియోజకవర్గంగా పేరున్న ఖానాపూర్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల్లో 72.20 శాతం పోలింగ్ నమోదవ్వడం ఇక్కడి ఓటర్లలో చైతన్యాన్ని చూపుతోందని చెబుతున్నారు. అంతేకాకుండా పురుషుల కంటే 8,245 మంది మహిళలు అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకొని చైతన్యాన్ని ప్రదర్శించారని ఖానాపూర్ ప్రాంత మహిళలను పలువురు ప్రశంసిస్తున్నారు.

నిప్పుల కొలిమిలా నిర్మల్ జిల్లా

● నర్సాపూర్(జి) మండలంలో

41.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు



ఖానాపూర్, మే 14 : నిర్మల్ జిల్లా నిప్పుల కొలిమిలా మారుతుంది. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో ఇంట్లోంచి బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యాయి. అత్యధికంగా నర్సాపూర్(జి) మండలంలో 41.05 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆరు మండలాలు ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. అత్యవసర పని ఉంటే తప్పా మధ్యాహ్నం వేళలో బయటకు రావద్దని అధికార యంత్రాంగం చూచిస్తోంది. ఎండ వేడిమికి ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతుండడంతో మధ్యాహ్నం సమయంలో జిల్లా వ్యాప్తంగా రహదారులన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి. జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నర్సాపూర్(జి) మండలంలో నమోదు కాగా అత్యల్పంగా లోకేశ్వరం మండలంలో 38.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కబేళాలకు తరలుతున్న పశువులు

● వేసవి పరిస్థితులతో తీవ్రమవుతున్న పశుగ్రాసం కొరత ● పోషణ భారమై అమ్మేసుకుంటున్న ఆదిలాబాద్ జిల్లా రైతులు



కబేళాలకు పశువులను తరలిస్తున్న దళారులు



అడుగంటుక పోయి కనిపిస్తున్న చెరువులు

ఆదిలాబాద్ అర్బన్, మే 14: జిల్లాలో నమోదవుతున్న రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో మూగజీవాలు అల్లాడుతున్నాయి. ముఖ్యంగా తాగునీరు, పశుగ్రాసం కొరతతో పశువులు బక్కచిక్కి పోతున్నాయి. అసలే జిల్లాలో నీటి వనరులు అంతంత మాత్రంగానే ఉండడంతో వేసవిలో వేల ఎకరాల పంట భూములు బీడు వారి పోతున్నాయి. ముఖ్యంగా జిల్లాలో వరి సాగు లేక పోవడంతో పశుగ్రాసం కొరత తీవ్రమవుతుంది. ప్రతీ ఏటా వేసవిలో పశుపోషణ భారమై రైతులు అమ్మేసుకునేందుకే ఆసక్తి చూపుతున్నారు. మళ్లీ వానకాల సీజన్ ప్రా రంభం కావడంతో కొనుగోలు చేస్తూ వానకాల పంటల సీజన్ ను వెల్లదీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎటు చూసిన పశుగ్రాసం ఎండుబారిపోయి కనిపిస్తుంది. ఇన్నాళ్లు కంటికి రెప్పల కాపాడుకున్న పశువులు కళ్లముందే బక్కచిక్కి పోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. చేసేది ఏమి లేక గత్యంతరం లేని పరిస్థితుల్లోనే కబేళాలకు తరలిస్తున్నారు. వేసవి ప్రారంభంకాగానే పాల దిగుబడులు కూడా భారీగా తగ్గిపోతున్నాయి. మేకలు, గొర్రెల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో అక్కడక్కడ దొరికే గడ్డి సైతం వాడిపోతుంది. అడవుల్లో సైతం ఆకులు కూడా దొరకక పోవడంతో పశువులు ఆర్తాకలితో అలమటిస్తున్నాయి. పశుగ్రాసానికి తోడు నీటికొరత కూడా తీవ్రమవుతుంది. గత యేడు కంటే ఈ సారి వేగంగా భూగర్భ జలాలు అడుగంటుక పోయాయి. దీంతో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు నెర్రలుబారీ కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల అవసరాలు,అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న దళారులు రైతుల చుట్టు తిరుగుతు ఎంతో కొంత ముట్టచెప్పి పశువులను కబేళాలకు తరలిస్తున్నారు.

వేసవి గడ్డు పరిస్థితులను అధిగమించేందుకు పశు సంవర్ధక శాఖ ఇప్పటి వరకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించక పోవడం అన్నదాతల పాలిటశాపంగా మారుతుంది. ఏదో నామమాత్రంగానే నివేదికలు రూపొందిస్తున్న నిధులు లేవన్న కారణంగా ఆచరణ సాధ్యం కావడం లేదంటున్నారు. వేసవి సమయంలో మేలైనా గడ్డి విత్తనాలను ఉచితంగా రైతులకు పంపిణీ చేసి పశుగ్రాసం కొరతను అధిగమించాల్సిన పశుసంవర్ధకశాఖ పట్టించుకున్నట్లే కనిపించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇకనైనా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను పరిశీలించి వెంటనే పశుగ్రాసం కొరతతో పాటు పశువులకు నీటివసతిని కల్పించాలని రైతులు కోరుతున్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థిని

కలిసిన మండల నాయకులు



బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్‌ను కలిసిన మండల నాయకులు

తలమడుగు,మే14:బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడంనగేష్‌ను మంగళ వారం తలమడుగు మండల బీజేపీ నాయకులు, మర్యాదపూర్వం కలిసి అభినందనలు తెలియజేశారు. నిన్నజరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ సరళి పై చర్చించారు. భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ శాతం పై చర్చించారు. అదే విధంగా తనను గెలిపించేందుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఇందులో బీజేపీ నాయకులు కనపర్తి చంద్రకాంత్, మహేందర్ యాదవ్, వెంకట స్వామి, ప్రేమేందర్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, కుంటలశ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు చేయడం ద్వారా

గ్రామంలో సుఖశాంతులు

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



సావర్గమ్‌లోని జగదాంబ ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మే 14: ప్రతీనిత్యం ఆలయాల్లో పూజలు చేయడం ద్వారా గ్రామంలో సుఖశాంతులు నెలకొంటాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని సావర్గాం గ్రామంలో శ్రీసంత్ సేవలాల్ మహరాజ్, జగదాంబ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరితో పాటు మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరు లు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని అడ్డుకోవడం సరైంది కాదు

● బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి సాజిదొద్దిన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాజిదొద్దిన్

ఆదిలాబాద్ అర్బన్, మే 14: గతంలో ఎప్పుడు జరగని అభివృద్ధి మాజీ బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో జరిగిందని బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి సాజిదొద్దిన్ అన్నారు. ఖానాపూర్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద మాజీ మంత్రి రామన్నను కాంగ్రెస్ నేతలు అడ్డగించడం సమంజసం కాదని తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హాయంలో జరిగిన పట్టణ అభివృద్ధిని వీడియో ద్వారా వివరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేశామని, ప్రజలకుకనీస వసతులను కల్పించడమే కాకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ నేతలు మాజీ మంత్రి జోగురామన్నను అడ్డుకుని ప్రశ్నించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు అయినప్పటికి పూర్తి స్థాయిలో గ్యారంటీలను అమలు చేయక పోవడం వారి అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. ఇందులో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రంసుగుణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

ఆదిలాబాద్ అర్బన్, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్‌లో కాంగ్రెస్‌ది వందశాతం గెలుపు ఖాయమని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ప్రజాసేవ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపు కోసం పని చేసిన ప్రతీఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. తన గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఎంతో శ్రమించారని చెప్పారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ లక్ష మెజార్టీతో విజయం సాధిస్తున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ ప్రధాని చేయడం ప్రతి ఒక్కరి లక్ష్యమని తెలిపారు. తమకు ఏ పార్టీ పోటీ కాదని, పదేళ్ల బీఆర్ఎస్, బీజేపీ ఆదిలాబాద్‌కు చేసిందేమి లేదని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాయని,గిరిజన లంబాడాలు అక్కున చేర్చుకున్నాయన్నారు. ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ విలేకరుల అసెంబ్లీ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి, సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్‌రంజాని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మాసంతోష్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, సాయిప్రణయ్,నాయకులు సుదాగోని సుదాకర్‌గౌడ్, గడ్డంజగదీశ్‌రెడ్డి, మునిగెల విఠల్, కిజర్‌పాషా,బూర్ల శంకరయ్య, కయ్యుమ్, నూర్‌ఖాన్, రజా, మున్నా, యోగేశ్, వదూద్, అన్నెల శంకర్, వసంత్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలే సరైన బుద్ధి చెప్తారు

● కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, మే 14 : బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని తమ కార్యకర్తలను గందరగోళానికి గురి చేశారని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను నమ్మించి నయవంచన చేశారని, గండ్రత్‌సుజాత, అల్లూరి సంజీవ్‌రెడ్డి పార్టీ ద్రోహులని అన్నారు. కాంగ్రెస్ పార్టీని విచ్ఛిన్నం చేయాలనుకునే వారికి కార్యకర్తలే సరైన బుద్ధి చెబుతారని హితవుపలికారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వద్ద డబ్బులు తీసుకుని పార్టీ ద్రోహులుగా మిగిలి పోయారని, మళ్లీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ బుద్ధి తెచ్చుకోకుండా బీజేపీతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారంటూ విమర్శించారు. ఇందులో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్‌రంజాని,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్, లోకప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, సాయి ప్రణయ్, నాయకులు సుదాగోని, సుధాకర్ గౌడ్, గడ్డంజగదీశ్‌రెడ్డి, మునిగెల విఠల్,గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో బీజేపీ గెలుస్తుంది

● ఎమ్మెల్యే పాయలశంకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయలశంకర్

ఆదిలాబాద్‌అర్బన్, మే 14 : రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో భారతీయ జనతాపార్టీ గెలుస్తుందని ఎమ్మెల్యే పాయలశంకర్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడంనగేష్ తెలిపారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రచార కార్యక్రమంలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తల తపన, నరేంద్రమోదీ అభిమానుల కోరిక ఫలిస్తుందని, అత్యధిక మెజార్టీతో బీజేపీ పార్టీ గెలుస్తుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడంనగేష్ అన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడంనగేష్ విజయాన్ని సాధిస్తారని అన్నారు.తెలంగాణలోనే అత్యధిక మెజార్టీతో బీజేపీ గెలుస్తుందని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో సహకరించి ఓటు వేసిన ఓటర్ మహాశయులకు, 47డిగ్రీల ఎండ తాపంలో ప్రచారక కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఇందులో బీజేపీ జిల్లా నాయకులు ముక్తాపురిఅశోక్,నగేష్, జోగు రవి, లాలామున్న, ఆకుల ప్రవీణ్, దయాకర్, సంతోష్, రాజు, రాజేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు

ఆదిలాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురవడంతో పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం జిల్లా గరిష్ట సగటు ఉష్ణోగ్రత 36.8డిగ్రీలు కాగా కనిష్ట ఉష్ణోగ్రత 25.2 డిగ్రీలుగా నమోదైంది. అలాగే బేల మండలంలో 38.7, బోథ్‌లో 38.4, బజార్‌హత్నూర్‌లో 37.8, ఇచ్చోడలో 36.7, తాంసిలో 35.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా 40డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.గత కొన్ని రోజుల క్రితం వరకు రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైన ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతు వస్తున్నాయి. పగలంతా ఎండ వేడిమి కనిపిస్తున్న సాయంత్రం వేళల్లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోతుంది. దీంతో వడగాలుల ప్రభావం కూడా తగ్గుతుంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



నేరడిగొండ, మే 14: యువత క్రీడల్లో రాణించాలని గిరిజన యువనాయకుడు తొడసం శంకర్ అన్నారు.మండలంలో ఈ నెల18 నుంచి జరుగనున్న నేరడిగొండ ప్రీమియర్‌లీగ్‌లో యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి యువ నాయకుడు తొడసం శంకర్ లీగ్‌లో పాల్గొనే సైనిక్ సిక్సర్స్ జట్టు సభ్యులకు క్రీడా దుస్తుల కోసం రూ.10వేలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జట్టు కెప్టెన్ మణిరాజ్, లీగ్ నిర్వాహకులు జాదవ్‌పవన్ కుమార్,లఖన్,అనిల్, దినేష్,యోగి, గణేష్, సిద్దు, ఆదిత్య, సునిల్, సతీష్, నరేందర్, చిన్న, సాయి, సురేష్‌లు పాల్గొన్నారు.

నాసిరకమైన ఆకుతో

నష్టపోతున్న బీడీ కార్మికులు

బోథ్, మే 14: మండలంలోని బీడీ కార్మికులకు గత కొంతకాలంగా నాసిరకమైన ఆకును సరఫరా చేస్తుండటంతో బీడీ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా దేశాయిబీడీ కార్యక్రమంలో పనిచేసే కార్మికులకు నాసిరకమైన ఆకు వస్తుండటంతో, ఈ విషయమై యాజమాన్యాలు ఆలోచించి నాణ్యమైన ఆకులు సరఫరా చేయాలని కోరుతున్నారు. అయితే కార్మికుల పక్షాన నిలబడి కార్మికసంఘాల వారు నాణ్యమైన ఆకులు సరఫరా చేసే విధంగా చూడాలని కార్మికులు కోరుతున్నారు. అంతే గాక ఆకుతూకంలో సైతం మోసం జరుగుతుందని పలు గ్రామాల కార్మికులు వాపోతున్నారు.

మార్కెట్ ఆవరణలో హమాలీలుగా తీసుకోండి

బోథ్, మే 14: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో జరుగుతున్న జొన్నల కొనుగోలులో హమాలీలుగా తమకు అవకాశం కల్పించాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి నారా మనోహర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా 12 మంది హమాలీలు తమకు జరిగిన అన్యాయంపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విన్నవించారు. లైసెన్స్ ఉన్న హమాలీలు కొందరు తమ ఇంటి వారిని పనిలో పెట్టుకుంటున్నారని ఈసారి నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అశోక్‌తో పాటు మరో పది మంది ఉన్నారు.

'ప్రభుత్వ కొనుగోలు ముగిసే వరకు వ్యాపారులు జొన్నను కొనుగోలు చేయవద్దు'

బోథ్, మే 14: ప్రభుత్వ రంగ సంస్థలు జొన్న పంటను కొనుగోలు చేయడం జరుగుతుందని పంట కొనుగోలు ఆగిపోయే వరకు రైతుల వద్ద ప్రైవేట్ వ్యాపారులు జొన్నలను కొనుగోలు చేయవద్దని ఏడీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డితో కలిసి మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ వ్యాపారస్తులు జొన్న పంటను తీసుకువస్తే రైతులు ఫిర్యాదు చేయాలన్నారు. సహకార సంఘం వారు సైతం పంట కొనుగోలు విషయంలో ఆచితూచి వ్యవహరించాలన్నారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి మనోహర్, చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలు ఉన్నారు.

పెరిగిన ఆదివాసీల ప్రాంతాల్లో పోలింగ్ శాతం

బోథ్, మే 14: సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసి గిరిజన గూడాల ప్రజలు ఓటు హక్కు విలువని తెలుసుకుని పోలింగ్‌లో ముందుకు రావడం జరిగింది. మండలం మొత్తం మీద 72.5 శాతం పోలింగ్ కాగా అత్యధికంగా మారుమూల గిరిజన గ్రామీణ కేశవ్ గూడలో 88.96 శాతం ఓట్లను వేయడం జరిగింది. అంతేగాక మరో గిరిజన గూడెం అయిన పిప్పల్దరి గ్రామస్తులు 86.53 శాతం ఓట్లను వేయడం జరిగింది. అతి తక్కువగా 257 పోలింగ్ బూత్ బి ఓటర్లు 66.12 శాతం ఓట్లను వేశారు. చదువు ఉన్న ఓటర్లు ఓటింగ్‌పై ఆసక్తి కనబర్చకపోగా నిరాక్షరాస్యులైన ఆదివాసీలు ఓటు వేసేందుకు ముందుకు రావడంతో అధికారులు వారిని అభినందిస్తున్నారు.

చెదిరిన గూడు .. బెదిరిన పక్షులు



పక్షులగూడులో మంటలు

బోథ్, మే 14: బోథ్ బస్టాండ్‌లో విద్యుత్ స్తంభంపైన పక్షులుగూడు కట్టుకున్నాయి. సాయంత్రం పూట గూటికి వచ్చేందుకు పక్షులు ప్రయత్నిస్తుండగా విద్యుత్‌తీగలు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో పక్షులు చెల్లా చెదురు కాగా అక్కడ ఉన్న వారందరూ భయ భ్రాంతులకు గురయ్యారు.

విద్యుత్‌షాక్‌తో నిరాలలో ఆవు మృతి



నిరాలలో మృతి చెందిన ఆవు

జైనథ్, మే 14: జైనథ్ మండలంలోని నిరాల గ్రామంలో మంగళవారం ఉదయం బొంద్రెకాశీనాథ్ అనే రైతుకు చెందిన ఆవు 33/11 కేవీ విద్యుత్ తెగిపడి మృతి చెందింది. స్థానిక నిరాల గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. రోజు వారిగా పశు వులను వేసవికాలంలో వివిధ పంట పొలాల్లో వేసవికాలంలో పశుగ్రాసానికి పశువులను అనునిత్యం పశువులను వదిలి పెడు తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభానికి గల కరెంట్‌వైర్ షాక్ కొట్టడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.ఈ విషయంపై రైతు కాశీనాథ్ ఫిర్యాదు మేరకు నిరాల గ్రామ సర్పంచ్ చౌదరి సునంద ప్రభాకర్, గ్రామ కార్యదర్శి రేఖ, విద్యుత్ లైన్‌మెన్ నరేష్‌లు పశువు పంచనామ నిర్వహించారు. మృతి చెందిన ఆవు విలువ రూ.40వేలు ఉంటుందని నిరాల గ్రామ ప్రజలు రైతులు తెలిపారు.

బెల్గావ్‌లో విద్యుత్ తీగపడి ఆవు మృతి



బెల్గావ్‌లో విద్యుత్ తీగలు తెగిపడి మృతి చెందిన ఆవు

జైనథ్, మే 14: జైనథ్ మండలంలోని బెల్గావ్ గ్రామంలో గల పరదేశి మహేశ్ అనే రైతుకు చెందిన ఆవు మంగళవారం సాయంత్రం విద్యుత్ తీగపడి ఆవు అక్కడికి అక్కడే మృతి చెందింది. ఈదురు గాలులు విద్యుత్ ఏజీఎస్ తీగపడి ఆవుమృతి చెందడంపై పశు వైద్యాధికారులు విద్యుత్ అధికారులకు లిఖిత పూర్వకంగా విన్నవించారు. దీని పై స్పందించిన అధికారులు ఆవు పంచనామా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోరజ్ జైనథ్ లైన్‌మెన్ శివకుమార్, జెఎల్ఎం నరేష్‌ఆన్‌మెడ్ వర్కర్ హార్షవర్ధన్‌లతో పాటు పశువైద్యాధికారులు, విద్యాధికారులు, బెల్గావ్ గ్రామరైతులున్నారు.

ఆత్మలింగ హనుమాన్ ఆలయంలో పూజలు




పెండల్‌వాడ ఆలయాన్ని సందర్శించుకున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

జైనథ్, మే 14: ఆదిలాబాద్ జల్లా గిరిజనుల ఆరాధ్య దైవం అయిన జైనథ్ మండలంలోని పెండల్‌వాడ గ్రామంలోని ఆత్మలింగ హనుమాన్ ఆలయాన్ని మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును పెండల్‌వాడ గ్రామప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.8। కనిష్ఠం 25.2



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

బుధవారం 15 మే 2024



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

కాంగ్రెస్ గెలుపు ఖాయం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్, మే 14: ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం అయిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమబొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ అభ్యర్థి ఆత్రం సుగుణ క్రిస్టియన్ అంటూ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ అసత్య ప్రకటనలు చేశారని విమర్శించారు. మతం కులం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తుందని అన్నారు. గెలుపు కోసం బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేదన్నారు. గోడంనగేష్ తనపై పిచ్చికుక్క కరిచినట్లు విమర్శలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని అన్నారు. తాము చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూపెట్టి ప్రజలను ఓట్లు అడిగామని, దీంతోనే సబండ వర్గాల ప్రజలు తమను ఆదరించారని అన్నారు. ఈ సమావేశంలో ఖయ్యూం, ఆత్రం రాహుల్, లింగంపల్లి చంద్రయ్య, మహమ్మద్ ఇక్బాల్, దాసండ్ల ప్రభాకర్, మొహమ్మద్ అజీముద్దీన్, నందం, తదితరులు పాల్గొన్నారు.





ఎంపీగా గెలుపు.. ఎవరిదో?

- జిల్లాలో లోక్‌సభ పోలింగ్ ముగిసింది.. ఫలితం మిగిలింది
- గెలుపుపై లెక్కలు వేసుకుంటున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- చివరి సమయంలో బీజేపీ వైపు మళ్లిన ఓటర్లు
- ఓ వర్గం ఓట్ల పైనే కాంగ్రెస్ పార్టీ భారీ ఆశలు
- ఓట్ల చీలికతో డీలా పడిపోయిన బీఆర్‌ఎస్ పార్టీ

ఆదిలాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన ఫలితం మాత్రం మిగిలిఉంది. ఇన్నాళ్లు ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ఉరుకులు పరుగులు పెట్టిన ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు అంచనాలు వేసుకుంటున్నారు. ఏ సామాజికవర్గం ఓటర్లు ఎటువైపు మద్దతుగా నిలిచారని? ఆరా తీస్తున్నారు. నియోజకవర్గాల్లో ముఖ్య నేతలతో మంతనాలు జరుపుతు పోలింగ్ సరళిపై చర్చించుకుంటున్నారు. అయితే ఓటర్ల మద్దతుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసినా.. ఫలితం మాత్రం జూన్ 4న తేలిపోనుంది. మరో 20 రోజుల పాటు ఫలితాల కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. అయితే పార్టీ నేతలు, అనుచరులు వివిధ రకాల అభిప్రాయాలు వ్యక్తం చేయడంతో అభ్యర్థులు కొంత ఆందోళనకు గురవుతున్నారు. ఫలితం కాస్త అటు ఇటు అయితే పరిస్థితి ఏమిటన్న ఆందోళన వ్యక్తమవుతుంది. 2019 లోక్‌సభ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడం ఎవరికి అనుకూలమనే చర్చ సాగుతుంది. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాల్లోని ఈవీఎంలను జిల్లాకేంద్రంలోని టీటీడీసీలోని స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించి భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత చర్యలు చేపట్టారు. లోక్‌సభ పరిధిలో మొత్తం 16లక్షల 50వేల 175 ఓటర్లు ఉండగా.. ఈసారి 12లక్షల 21వేల 563 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో 74.03 శాతం పోలింగ్ నమోదైన ట్లు అధికారులు వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల కీలక ఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిపోవడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు. అక్కడక్కడ చిన్నపాటి ఘర్షణలు తప్ప పోలింగ్ సజావుగానే సాగింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 75.44 శాతం పోలింగ్ నమోదు కాగా 2019 ఎన్నికల్లో 71.0 శాతం, 2024 ఎన్నికల్లో 74.03 పోలింగ్ శాతం నమోదైంది. ఈసారి పెరిగిన పోలింగ్ శాతంపై ప్రధాన పార్టీల అభ్యర్థులు కొంత ఆందోళనకు గురవుతున్నారు.

నియోజక వర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
సిర్పూర్	229101	163944	71.56
ఆసిఫాబాద్	227208	171511	75.49
ఖానాపూర్	224523	162101	72.20
ఆదిలాబాద్	245137	181136	73.89
బోథ్	211313	165157	78.16
నిర్మల్	258314	185168	71.68
ముథోల్	254579	198546	75.63
మొత్తం	16,50,175	12,21,563	74.03

ఎవరి ధీమా వారిదే..

ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు విశ్వప్రయత్నాలు చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ఎవరికి వారే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాల వారీగా పోలైనా ఓట్ల వివరాలను సేకరిస్తూ లెక్కలు వేసుకుంటున్నారు. ఫలానా నియోజకవర్గంలో తమకు భారీ మెజార్టీ వస్తుందని అంచనా వేసుకుంటున్నారు. ముఖ్యంగా ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాలపై బీఆర్‌ఎస్ భారీ ఆశలు పెట్టుకుం టుండగా ముథోల్, నిర్మల్, ఆదిలాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలపై కమలం పార్టీ ధీమాతో కనిపిస్తుంది. ఖానాపూర్ నియోజక వర్గంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమను గట్టెక్కిస్తాయని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ వస్తే గెలుపు ఖాయమని బీజేపీ గట్టిగా నమ్ముతుంది. కార్మికులు, బలహీన వర్గాలు, రైతులు, మైనార్టీ ఓట్లతో విజయం ఖాయమన్న భరోసా కాంగ్రెస్‌లో కనిపిస్తుంది. కానీ చివరి సమయంలో అంచనాలు తారుమారు కావడంతో ఫలితాలు వచ్చే వరకు వేచి చూద్దామంటూ ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

మోదీ ఇమేజ్ పని చేసినట్టేనా!?

గత దశాబ్ద కాలంగా మోదీ ఇమేజ్‌తో గట్టెక్కుతున్న బీజేపీకి ఈసారి కూడా మోదీ ఇమేజ్ బలంగా పని చేసింది. పార్టీ అభ్యర్థి ఎవరన్నది చూడకుండా మోదీ ఇమేజ్‌తోనే యువత, మహిళలు భారీగా ఓట్లు వేసినట్లు తెలిసింది. ఔర్ ఏక్ బార్ మోదీ అనే నినాదంతో బీజేపీ ముందు కెళ్లడం కలిసి వచ్చింది. బీజేపీ అభ్యర్థి ఎన్నికల ముందే పార్టీలో చేరి టికెట్ దక్కించుకున్న అంతగా వ్యతిరేకత కనిపించ లేదు. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ చేసిన విమర్శలు కూడా అంతగా పని చేయలేదు. కొన్ని నియోజకవర్గాలలో పార్టీలకతీతంగా మోదీ కోసం ఓటు వేస్తున్నట్లు ఓటర్లు బహిరంగంగానే పేర్కొన్నారు. దీంతో బీజేపీ చివరి సమయంలో ఊహించని విధంగా పుంజుకుందనే చెప్పవచ్చు. బీఆర్‌ఎస్ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గుచూపడంతో మరింత బలపడే అవకాశం ఉందంటున్నారు. హిందుత్వవాదంతో యువత, విద్యావంతులు బీజేపీ వైపే మొగ్గు చూపి నట్లు తెలుస్తుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆదివాసీ ఉద్యమంతో ఓటమి పాలైన బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌కు అదే ఉద్యమం కలిసి వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఆదివాసీ ఉద్యమ సమయంలో తటస్థంగా ఉన్న నగేష్‌కు మెజార్టీ లంబాడా ఓటర్లు మద్దతునిచ్చినట్లు చెబుతున్నారు.

గంపగుత్త ఓట్లపై కాంగ్రెస్ ధీమా

పార్టీ క్యాడర్‌తో పాటు ఓ వర్గానికి చెందిన గంపగుత్త ఓట్లతో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్న ధీమాతో కనిపిస్తుంది. లోక్‌సభ ఎన్నికలు రెండు వర్గాల మధ్యనే అన్నట్లుగా కనిపించడంతో పోటాపోటీగా ఓటర్లు మద్దతుగా నిలిచారు. బీజేపీని ఓడించేందుకు ఓ సామాజికవర్గం వన్ సైడ్‌గా కాంగ్రెస్ వైపే మొగ్గు చూపిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ పరిధిలో ఈవర్గం ఓటర్లు సుమారుగా 2లక్షల 30వేలు ఉండడంతో కాంగ్రెస్ గెలుపుపై ధీమాతో కనిపిస్తుంది. అలాగే ఇతర వర్గాల ఓటర్లు సంప్రదాయ ఓట్లతో గట్టెక్కె అవకాశం లేకపోలేదంటున్నారు. లోక్‌సభ పరిధిలో ఒకే నియోజక వర్గంలో గెలిచిన కాంగ్రెస్ ఆదివాసీ ఓటర్లతో గెలుపు అంచనాలను వేసుకుంటుంది. లోక్‌సభ పరిధిలో సుమారుగా ఆదివాసీ ఓటర్లు లక్షా 50వేల వరకు ఉంటారని అంచనా వేస్తు న్నారు. ఇందులో మెజార్టీ ఓట్లు కాంగ్రెస్ దక్కించుకుంటుందని చెబు తున్నారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అధికారం అండతో గెలుపు అవకాశాలు లేక పోలేదన్న అభిప్రా యాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీకి ప్రత్యామ్నాయం కాంగ్రెస్ అనే వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ సక్సెస్ అయిందనే చెప్ప వచ్చు. అయితే బీఆర్‌ఎస్ నుంచి భారీగా వలసలు పెరగడంతో కాంగ్రెస్ బలపడిందన్న భావన కూడా వ్యక్తమవుతోంది.

చేతులెత్తేసిన బీఆర్‌ఎస్

ఎన్నికల పోలింగ్ వరకు త్రిముఖ పోటీ కనిపించిన పోలింగ్ రోజు పరిస్థితులు ఒక్కసారిగా తారుమారైనట్లు తెలుస్తుంది. బీఆర్‌ఎస్ మెజార్టీ ఓట్లు బీజేపీ వైపు మొగ్గు చూపడంతో ఆ పార్టీ క్యాడర్ పూర్తిగా ఢీలా పడిపోయింది. కొన్ని చోట్ల పోలింగ్ ఏజెంట్లు కూడా కనిపించని పరిస్థితి ఎదురయ్యింది. ఇప్పటికే వలసలతో పలుచబడి పోయిన బీఆర్‌ఎస్ ఉన్న కాస్త ఓట్లను దక్కించుకోలేక పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో నేతల మధ్య ఉన్న విబేధాలతో బీఆర్‌ఎస్ ఓటర్లు బీజేపీ, కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపినట్లు కనిపించింది. క్రాస్ ఓటింగ్‌తో భారీగా నష్టం వాటిల్లిందంటున్నారు. ముఖ్యనేతలంతా కాంగ్రెస్, బీజేపీలలో చేరడంతో కార్యకర్తలకు అండగా నిలిచే వారే కరువయ్యారు. దీంతో కార్యకర్తలు స్థానిక రాజకీయ పరిస్థితులను బట్టి ఓటు వేశారంటున్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

బాధితులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్, మే 14: ఆదిలాబాద్ జిల్లా జైల్‌లో అరెస్టు అయి ఉన్న హనుమాన్ స్వాములను కలిసేందుకు వచ్చిన బాధిత కుటుంబీకులను ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ పరామర్శించారు. జైలు అధికారులతో మాట్లాడి మూలాకత్ అయ్యేందుకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ మనోధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఇందులో బీజేపీ జిల్లా నాయకులున్నారు.



మాట్లాడుతున్న సాధారణ పరిశీలకుడు రాజేంద్రవిజయ్

కట్టుదిట్టమైన భద్రతతో స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలు

ఆదిలాబాద్ అర్బన్, మే 14: కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)లను ఓట్ల లెక్కింపు కేంద్రమైన జిల్లాలోని మూడు కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించడం జరిగిందని సాధారణ పరిశీలకుడు రాజేంద్రవిజయ్, రిటర్నింగ్ అధికారి రాజార్షిషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సెగ్మెంట్ల నుంచి తరలించిన ఈవీఎంలను జాగ్రత్తగా సరిచూసుకుని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని స్ట్రాంగ్ రూమ్‌లలో నియోజకవర్గాల వారీగా అమర్చడం జరిగిందన్నారు. మంగళవారం అభ్యర్థుల ఏజెంట్లు, ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజార్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేశారు. కాగా మంగళవారం ఉదయం 4గంటల ప్రాంతంలో పోలింగ్ అనంతరం రిసెప్షన్ సెంటర్‌కు చేరుకున్న ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్, బోథ్ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోని స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించిన అనంతరం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం గోదాంను పరిశీలించారు. అనంతరం ఆదిలాబాద్‌లోని సంజయ్ పాల్‌టెక్నికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన నిర్మల్, ముథోల్, ఖానాపూర్, స్ట్రాంగ్ రూమ్‌లలో, సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన సిర్పూర్, ఆసిఫాబాద్ స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచి, ఈవీఎంల భద్రత ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, టీటీడీసీలో మూడు జిల్లాలకు సంబంధించిన అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో స్క్రూట్నీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్లు ఆదిలాబాద్ శ్యామలాదేవి, ఆసిఫాబాద్ దీపక్‌తివారి, డీఆర్‌వో లోకేష్, మూడు జిల్లాల ఆర్డీవోలు వినోద్, రత్న కళ్యాణి, కోమల్‌రెడ్డి, జివాకర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

● కౌంటింగ్ వరకు కొనసాగుతుంది : ఎస్పీ గౌస్‌ఆలం ● టీటీడీసీ ప్రాంగణంలో భద్రతా చర్యల పరిశీలన ● సిబ్బందికి పలు సూచనలు

ఆదిలాబాద్ అర్బన్, మే 14: జిల్లాకేంద్రంలో ఏర్పాటు చరేసిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. మంగళవారం స్థానిక టీటీడీసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత చర్యలను జిల్లా ఎస్పీ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజక వర్గంలో అసెంబ్లి నియోజక వర్గాల వారీగా మూడు ప్రాంతాలలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచినట్లు తెలిపారు. ఈవీఎంలు, వీవీపాట్లు, పోలింగ్ సామాగ్రి భద్రపరిచే రూముల వద్ద మూడంచెల భద్రత కొనసాగుతుందని అందులో మొదటి వలయంలో కేంద్ర బలగాలైన సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్‌తో పహారా, రెండవ భాగంలో జిల్లా రిజర్వ్ పోలీసులతో పహారా, మూడవ భాగంలో పట్టణ పోలీసులతో గస్తీ నిర్వహిస్తూ పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ జరిగే వరకు ఈ భద్రత కొనసాగుతుందని, భద్రతలో భాగంగా వర్షాలు, ఈదురు గాలులు అపత్కాల ఘటనలకు తట్టుకునే విధంగా గట్టి రక్షణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ స్ట్రాంగ్ రూమ్‌లకు ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులను భద్రత ఇన్‌చార్జీలుగా నియమించినట్లు తెలిపారు. రక్షణ చర్యల్లో భాగంగా సీసీటీవీ కెమెరాలను అమర్చినిరంతరం పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూములను సందర్శించే ప్రతి ఒక్కరి సంతకం భద్రత అధికారులు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని, సందర్శించిన సమయం, వెళ్లిన సమయం, నమోదు చేయాలని సూచించారు.ఏ సమయంలోనైనా ఆకస్మిక తనిఖీలు జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని ఎల్లవేళల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. రాత్రి సమయాలలో మూడు చోట్ల భవనాల చుట్టు పెట్రోలింగ్, గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



భద్రత సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్‌ఆలం



సమావేశంలో పాల్గొన్న ఏజెంట్లు



ఉట్నూర్ నుంచి జిల్లాకేంద్రానికి ఖానాపూర్ నియోజకవర్గం ఈవీఎంలను తరలిస్తున్న ఎన్నికల అధికారులు

● పటిష్ఠ భద్రత మధ్య ఈవీఎంల తరలింపు

ఉట్నూర్: ఆదిలాబాద్ పార్లమెంట్ పోలింగ్ ప్రక్రియ సోమవారం పూర్తి కావడంతో ఖానాపూర్ నియోజక వర్గం ఎన్నికల అధికారులు పటిష్ఠ పోలీసు భద్రత మధ్య మంగళవారం ఈవీఎంలను ప్రత్యేక కంటైనర్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. ఖానాపూర్ నియోజక వర్గంలోని 309 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ నిర్వహించిన అధికారులు ఎన్నికల సిబ్బంది సోమవారం రాత్రికి ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈవీఎంలను రికవరీ చేసుకున్నారు. అక్కడే భద్రపరిచిన అధికారులు మరుసటి ఉదయం ఏడు గంటలకే ప్రత్యేక కంటైనర్‌లో 309 ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు భద్రంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి పంపించారు. జూన్ 4న జిల్లాకేంద్రంలోని సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్‌లో పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగనున్నందున సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్‌లోనే ఖానాపూర్ నియోజక వర్గంలోని ఈవీఎంలను, పోలింగ్ సామాగ్రిని భద్రపరిచారు. నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌తో పాటు ఖానాపూర్ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి జీవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి పోలింగ్ సామగ్రి తరలిస్తుండగా ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి, ఇంద్రవెల్లి ఎస్సై దుబ్బాక సునీల్‌లతో పాటు ప్రత్యేక పోలీసుల భద్రత మధ్య తరలించారు.







ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్రవిజయ్, రిటర్నింగ్ అధికారి రాజార్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేస్తున్న దృశ్యం



● కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్న ఆత్రం సుగుణ



● పోలింగ్ ముగియడంతో ఇంట్లో చపాతీలు చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ



● మాజీ మంత్రి, కార్యకర్తలతో కలిసి ముచ్చటిస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



● కార్యకర్తలు, స్నేహితులతో కలిసి ముచ్చటిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఎన్నికల సమరంలో.. తీరకలేకుండా గడిపిన అభ్యర్థులు తాజాగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రచార పర్వంలో సుమారు రెండు నెలల పాటు కుటుంబ సభ్యులకు దూరంగా అలుపెరగకుండా పర్యటించిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికలు ముగిసి పోవడంతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతున్నారు. కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, సన్నిహితులు, శ్రేయోభిలాషులతో ఉత్సాహంగా మాట్లాడుతూ కనిపించారు. ఫలితాల వెల్లడికి మరో 20 రోజుల సమయం ఉండడంతో అప్పటి వరకు ప్రశాంతంగా ఉండనున్నారు.

(- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)